

శిథిలమైన గచ్చు, తలుపులు లేని వెనుక ద్వారం



> ముడసర్లోవ జంక్షన్ వద్ద జీవీఎంసీ కొన్ని రూ.కోట్లు నిధులు ఖర్చుచేసి నిర్మించిన భారీ భవనం నిరుపయోగంగా మిగిలింది. జీవీఎంసీ జోనల్ కార్యాలయం కోసమని నిర్మించిన ఈ విశాలమైన భవన లక్ష్యం నెరవేరకుండా పోయింది. అప్పట్లో ఇక్కడ కొద్ది నెలల పాటు ఇసుక యార్డు, కొన్నేళ్ల పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో దీన్ని వినియోగించకుండా ఖాళీగా వదిలేశారు. దీంతో ఈ భవనం రూపురేఖలు మారిపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది.
>
> – ఆరిలోవ

రూ.6 కోట్ల భవనం.. నిరుపయోగం

ముడసర్లోవ వద్ద ఖాళీగా జీవీఎంసీ భవనం

- నెరవేరని జోనల్ కార్యాలయ లక్ష్యం
- గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు వినియోగం
- ఏడాదిన్నరగా వినియోగంలో లేని వైనం
- పట్టించుకునే వారు లేక.. శిథిలావస్థకు నిర్మాణం

ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ వద్ద దీన్‌దయాల్ పురం ఎదురుగా జీవీఎంసీ సుమారు 12 ఏళ్ల కిందట ఓ భవనం నిర్మించింది. బీఆర్‌టీఎస్ రహదారి పక్కన పచ్చని మామిడి, కొబ్బరి చెట్లతో ఉండే జీవీఎంసీకి చెందిన రెండెకరాల విస్తీర్ణంలో 2011లో అధికారులు జోనల్ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. దీని కోసం రూ.6 కోట్లు నిధులు కేటాయించి ఆగమేఘాలపై పనులు జరిపారు. 2013 నాటికి మూడు అంతస్తుల్లో భవన నిర్మాణం పూర్తి చేశారు. అధికారులు దీనిలోకి మధురవాడలోని జోన్-2 కార్యాలయాన్ని తరలించడానికి సన్నాహాలు చేశారు. అప్పట్లో ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు అడ్డుకోవడంతో అధికారులు ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చింది. దీంతో 2014లో కొద్ది నెలలు దీని ఆవరణాన్ని ప్రభుత్వ ఇసుక యార్డుగా మార్చేశారు. అనంతరం 2015లో హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహణ కోసం జీవీఎంసీ అధికారులు లీజుకు ఇచ్చేశారు. దీని ద్వారా నెలకు రూ.15 లక్షలు జీవీఎంసీకి హెచ్‌సీపీసీల్ అద్దె చెల్లించేది. రూ.6 కోట్లతో నిర్మించిన భవనాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకోలేని అధికారులు.. అద్దెకు ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. దీనిపై అప్పట్లో జీవీఎంసీ అధికారులపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. లీజు గడువు తీరిన తర్వాత 2023 నవంబర్‌లో హెచ్‌సీపీఎల్ యాజమాన్యం ఆ భవనాన్ని ఖాళీ చేసి అధికారులకు అప్పగించేసింది. అప్పటి నుంచి ఒకటిన్నరేళ్లుగా ఈ భవనం ఖాళీగా ఉండటంతో కొన్ని భాగాలు శిథిలావస్థకు చేరాయి. కూటమి ప్రభుత్వంలో అధికారులు విలువైన ఈ భవనాన్ని వినియోగించుకోకుండా ఖాళీగా వదిలేశారు.



అద్దాలు పగిలిపోయిన భవనం వెనుక భాగం

ఉపయోగం లేని సెక్యూరిటీ

ప్రస్తుతం ఈ భవనానికి నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. రెండు సిఫ్ట్‌ల్లో ఇద్దరేసి చొప్పున పనిచేస్తున్నారు. వారికి జీవీఎంసీ నెలకు సుమారు రూ.60 వేల వరకు వేతనాలు చెల్లిస్తూ ఈ నిరుపయోగ భవనానికి కాపలాగా ఉంచింది. దీని వల్ల ఉపయోగం లేదు సరికదా.. జీవీఎంసీ అధికారులు నెలకు రూ.50 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు.

అంతా అస్తవ్యస్తం

రూ.6 కోట్లతో నిర్మించిన ఈ విశాల భవనం శిథిలావస్థకు చేరి భూత్ బంగ్లాను తలపిస్తోంది. **గోడలు పెచ్చులు ఊడిపోయాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. వర్షాలు పడుతున్నప్పుడు శ్లాబ్‌ల నుంచి గోడల ద్వారా నీరు గదుల్లోకి** చేరి నిల్వ ఉండిపోతుంది. గోడల పెచ్చులు, గచ్చులు ఊడిపోయి భవనమంతా అస్తవ్యస్తంగా మారింది.

ఏడాది కిందట ఈ భవనాన్ని సందర్శించిన అప్పటి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ దీని పరిస్థితిని పరిశీలించి అవాక్ అయ్యారు. రూ.కోట్లు జీవీఎంసీ నిధులు వెచ్చించి నిర్మించిన ఈ భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారంటూ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హెచ్‌పీసీఎల్ యాజమాన్యం నిర్వహణ లోపం వల్లే ఈ భవనం శిథిలమైందన్న ఆలోచనతో వారి చేతే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు లేకపోవడం విశేషం.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ఈ భవనాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత దీనికి జీవీఎంసీ అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఏదైనా ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇది నివాసాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. దీని వెనుక మామిడి తోట ఉండటంతో రాత్రిళ్లు ఈ ప్రాంతం నిర్మానుష్యంగా మారుతుంది. దీంతో విశాలమైన ఈ భవనంలో కొందరు యువకులు రాత్రి వేళ గుట్టుగా ప్రవేశిస్తున్నారు. గదుల్లో గంజాయి, మద్యం తాగడంతోపాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలు చేసుకుపోతున్నారు.

నిరుపయోగంగా వదిలేశారు



ముడసర్లోవ వద్ద విశాలమైన స్థలంలో మామిడి, కొబ్బరి చెట్లు ఉండేవి. వాటిని తొలగించి జీవీఎంసీ అధికారులు పెద్ద భవనం నిర్మించారు. ప్రభుత్వ భూమిలో ప్రజా ధనంతో నిర్మించిన భవనాన్ని వినియోగించకుండా దుర్వినియోగం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి ఈ భవనాన్ని ప్రజల కోసం వినియోగంలోకి తీసుకురావాలి.

– పి.శంకరరావు, ఆరిలోవ కాలనీ

ప్రభుత్వ కార్యాలయంగా వినియోగించాలి



మధురవాడలో ఉన్న జోనల్ కార్యాలయాన్ని ఈ భవనంలోకి తరలిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. దీని నిర్మించాక అసలు ఉద్దేశం వదిలేసి అద్దెకు ఇచ్చేశారు. ఇప్పుడీ భవనం ఖాళీగా ఉండటంతో యువత తప్పుదోవలో నడవడానికి అడ్డాగా మారింది. అధికారులు ఈ భవనాన్ని ఏదైనా ప్రభుత్వ కార్యాలయంగా వినియోగిస్తే బాగుంటుంది. – కె.మోహనరావు, టీబీసీ పాయింట్

జేఎస్‌ఎస్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన శిక్షణ సంస్థాన్(జేఎస్‌ఎస్)లో స్వల్పకాలిక సమ్మర్ క్రాష్ కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ క్రాష్ కోర్సుల జాబితాలో భాగంగా బ్యూటీషియన్ 3 నెలలు, డ్రెస్ మేకింగ్ 3 నెలలు, అడ్వాన్స్‌డ్ టైలరింగ్ కోర్సు ఒక నెల, డీటీపీ (డెస్క్ టాప్ పబ్లిషింగ్) 3 నెలలు, ఫొటోషాప్ 3 నెలలు, ప్రీ-స్కూల్ టీచర్ ట్రైనింగ్ 6 నెలలు, స్పోకెన్ ఇంగ్లిష్ 3 నెలలు, ఎంఎస్ ఆఫీస్ ఒక నెల, అకౌంటింగ్ ప్యాకేజీ ఒక నెల, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ 15 రోజులు, అగరబత్తి తయారీ వారం రోజులు, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ 10 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందన్నారు. ఆయా కోర్సుల్లో శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 16లోగా పిఠాపురం కాలనీలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయంలో అందించాలని సూచించారు. వివరాలకు 85000 54456 నంబర్‌లో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ కోరారు.

కదలని ఆటో.. కమ్ముకున్న పొగ




బీఆర్‌టీఎస్ రోడ్డులో విమ్స్ కూడలి వద్ద ఆటో సైలెన్సర్ నుంచి వస్తున్న దట్టమైన పొగ

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారిలో ఓ ఆటో కలకలం రేపింది. పెదగదిలి నుంచి హనుమంతవాక వైపు ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటో విమ్స్ కూడలి వద్ద ఆకస్మికంగా ముందుకు కదలకుండా నిలిచిపోయింది. అయినప్పటికీ దాని ఇంజిన్ ఆగలేదు. ఆన్‌లోనే ఉంటూ పెద్ద శబ్దంతో ఆటో సైలెన్సర్ నుంచి దట్టమైన పొగ కమ్ముకొచ్చింది. దీంతో సుమారు 10 నిమిషాల పాటు రోడ్డంతా అల్లుకున్న పొగలోనే వెనుక నుంచి వాహనాలు ప్రయాణించాల్సి వచ్చింది. ఏం జరుగుతుందో తెలియక దూరం నుంచి చూసిన కొందరు వాహన చోదకులు అక్కడే రోడ్డు మధ్యలో వాహనాలు నిలిపేశారు. ఈ ఆటో పొగ కొంతసేపు రోడ్డుపై భయాందోళనలు కలిగించింది. చూసేందుకు మండుటెండలో జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేసినట్లు తలపించింది.

క్లుప్తంగా

గాజుల అలంకరణలో చిన పోలమాంబ



మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామదేవత చిన పోలమాంబ ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం గాజుల అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

మద్దిలపాలెం: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేఆర్‌ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అర్బన్ సీడీపీవో ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ సెలియా ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి తెలిపారు. 6వ రోజు బాలికల ఆరోగ్యంపై, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. బాలికల్లో నెలకొన్న సందేహాలను తెలుసుకుని, వాటిని నివృత్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్, స్థానిక కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాలుర పరిశీలన గృహానికి యూనిఫారాల వితరణ



మాట్లాడుతున్న పినాకిల్ ఆస్పత్రి అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహానికి శుక్రవారం పినాకిల్ హాస్పిటల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యూనిఫారాలు వితరణ చేసింది. సీఎస్సార్ నిధులు వినియోగించి 200 జతల యూనిఫారాలను గృహం పర్యవేక్షణాధికారి కె.వీరయ్య ఆధ్వర్యంలో బాలురకు ఆస్పత్రి కార్పొరేట్ వ్యవహారాల అండ్ ఆడిట్ మేనేజర్ టి.మణిరాజు, కంపెనీ సెక్రటరీ సోనికుమారి, సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పినాకిల్ ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం గృహంలో 67 మంది బాలురు ఉన్నారని, వారందరికీ యూనిఫారాలు అందజేసినట్లు చెప్పారు. బాలుర గృహం సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురు యువకుల అరెస్ట్

బీచ్‌రోడ్డు: గంజాయి కొని సేవిస్తున్న నలుగురు యువకులను మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా.. బీచ్ రోడ్డులో కొంత మంది యువకులు గంజాయి సేవిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాజ్‌కుమార్, నితీష్, రఘు, నాగరాజు అనే నలుగురు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 20 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. వారికి గంజాయి ఎక్కడ నుంచి వచ్చిందనే దానిపై పోలీసులు విచారిస్తున్నారు.

10వ వార్డులో మేయర్‌కు సమస్యల స్వాగతం



ఇందిరానగర్ కాలువలో మురుగు నీటిని పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో శుక్రవారం మేయర్ పీలా శ్రీనివాసరావు జోన్-2 అధికారులతో కలిసి పర్యటించారు. ఇందిరానగర్, రాజీవ్ నగర్, బీఎస్‌ఆర్ నగర్ ప్రాంతాల్లోని కాలువలు, గెడ్డలను పరిశీలించారు. ఆయా కాలనీల్లో మేయర్‌కు సమస్యలు స్వాగతం పలికాయి. ఏడాది కాలంగా శిథిలమైన రోడ్లు, మురుగుతో నిండిన కాలువలు, పిచ్చి మొక్కలతో నిండిన గెడ్డలు దర్శనమిచ్చాయి. ఇందిరానగర్‌లోని కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు ఎక్కడిదక్కడే నిల్వ ఉండిపోయింది. బీఎస్‌ఆర్ నగర్‌లో వీధి కుళాయి పైపులు అస్తవ్యస్తంగా మారాయి. తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు మేయర్‌కు విన్నవించుకున్నారు. రాజీవ్‌నగర్‌లో శిథిలమైన రోడ్లు నడవలేని విధంగా మారాయి. వాటిని పరిశీలించిన మేయర్ అన్ని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా.. మేయర్‌గా ఎన్నికైన అనంతరం మొదటి సారిగా 10వ వార్డును పీలా సందర్శించారు. మేయర్ పర్యటనలో వార్డు కార్పొరేటర్ (టీడీపీ) మద్దిల రామలక్ష్మి పాల్గొనక పోవడం విశేషం. దీంతో ఆయన వార్డులో కార్యకర్తలతోనే మమా అనిపించారు. జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, వివిధ విభాగాల అధికారులు, స్థానికులు, కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



తూర్పు సమితి కొత్త కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం: సీపీఐ 25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మరుపల్లి. పైడిరాజు, పడాల గోవింద్‌లు పిలుపునిచ్చారు. హెచ్‌బీ కాలనీలో శుక్రవారం తూర్పు నియోజకవర్గ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలకు అర్బన్‌లో రెండు సెంట్లు ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధరలు పెరుగుదలను నియంత్రించాలని, విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలన్నారు. వెంటనే విశాఖ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభల్లో చర్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలు, ప్రజా సమస్యలపై ఏ విధంగా ముందుకు పోవాలో చర్చించి భవిష్యత్తు కర్తవ్యాన్ని రూపొందిస్తామని తెలిపారు. 10వ తేదీ సాయంత్రం కంచరపాలెం మెట్టు నుంచి పెద్ద ఎత్తున ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూతన సమితి ఎన్నిక

ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ నూతన సమితిని ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా నియోజకవర్గ కార్యదర్శిగా షేక్ రెహమాన్, సమితి సభ్యులుగా పడాల గోవిందా, పైల ఈశ్వరరావు ఎ.దేవుడమ్మ దుల్ల.సత్తిబాబు, కాయల లక్ష్మణరావు, యు.కె.నాయుడు, నగిరెడ్ల మధు, బి.పుష్పలత, కొమర సందీప్ ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్.కాసుబాబు, ఈగల వలస, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలని డీఈవోకు వినతి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లో కూడా బ్రిడ్జ్ కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో స్కూళ్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, ఉపాధ్యక్షుడు కె.కిరణ్, నాయకుడు శంకర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ.. అభివృద్ధి పనులట..!

- జీసీ కాలనీ కొండపై చీకట్లో రక్షణ గోడ, రోడ్డు నిర్మాణం
- కొందరు నాయకుల లబ్ధి కోసమేనంటున్న నివాసులు



కొండపై నివాసాలు లేని ఖాళీ స్థలం వైపు రోడ్డు నిర్మాణానికి తవ్విన కొండ భాగం



గురువారం అర్ధరాత్రి సమయంలో రక్షణ గోడకు కాంక్రీట్ వేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంపీ 11వ వార్డు బాలాజీనగర్ ప్రాంతం బీసీ కాలనీ కొండపై ఖాళీ స్థలానికి లబ్ధి చేకూరేలా అధికారులు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆ స్థలానికి రక్షణ గోడతోపాటు రోడ్డు నిర్మిస్తున్నారు. నివాసాలున్న చోట్ల అవసరమైన రక్షణ గోడలు నిర్మించని అధికారులు ఖాళీ స్థలంలో రూ.లక్షల ప్రజా ధనం ఖర్చుచేస్తున్నారు. ప్రజలెవ్వరూ చూడరులే అనుకున్నారా.. ఏమో అర్ధరాత్రి వేళ చీకట్లో పనులు జరిపిస్తున్నారు. పగటి సమయంలో పనిచేయడానికే తీరిక ఉండని అధికారులు ఇక్కడ మాత్రం రాత్రి సమయంలో పనులు జరిపించడం విశేషం.

కొండపైన ఖాళీ స్థలంలో..

రాత్రి వేళల్లో పనులు చేయడంపై స్థానికుల్లో ఆరోపణలకు తావిస్తోంది. కొండపై దారిలేని ఖాళీ స్థలానికి రోడ్డు, రక్షణ గోడ నిర్మిస్తున్నారు. అక్కడ రెండు, మూడు నివాసాలు, దాని పక్కన ఖాళీ స్థలం (కొండవాలు భాగం) ఉంది. దానికి విలువ పెరిగేలా కొందరు స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిడితో జీవీఎంసీ అధికారులు అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానికులు విస్మయం చెందుతున్నారు. ఇదే కొండపై పలుచోట్ల రహదారుల సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల మెట్లు శిథిలమవగా, మరికొన్ని చోట్ల రక్షణ గోడలు లేవంటున్నారు. కొందరు నాయకులకు లబ్ధి చేకూర్చడానికే అధికారులు పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ పనులు పగలు చేస్తే అందరికీ తెలిసిపోతుందని రాత్రిళ్లు చేపడుతున్నారని అంటున్నారు. గురువారం అర్ధరాత్రి ఇక్కడ రక్షణ గోడకు కాంక్రీట్ వేశారు.

ఈ విషయంపై జీవీఎంసీ వార్డు ఏఈ వెంకటరావును వివరణ కోరగా.. కొండపై పాత రోడ్డు ఉండేదని, అది శిథిలం కావడంతో రూ.32 లక్షలతో కొత్తగా రహదారి, రక్షణ గోడ నిర్మిస్తున్నామని తెలిపారు.

‘స్వర్ణాంధ్ర-2047’పై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఈడీ సత్యపద్మ

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంవీపీ సెక్టార్-9లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ సత్యపద్మ జీవీఎంసీ జోన్-3, సచివాలయ కార్యదర్శులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, విధివిధానాలపై సమీక్షించారు. జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ఆరిలోవ: మద్యం పూటుగా తాగిన మత్తులో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అనకాపల్లిలో నివసిస్తున్న దొడ్డి శేఖర్(40) అనే వ్యక్తి శుక్రవారం ఆరిలోవ బాలాజీనగర్‌లో నివసిస్తున్న తల్లి వద్దకు వచ్చాడు. ఇంటికి వెళ్లే సమయానికే పూటుగా మద్యం తాగి ఉన్నాడు. మద్యం మత్తులో మధ్యాహ్నం వాంతులు చేసుకున్నాడు. అనంతరం నిద్రపోయాడు. సాయంత్రం ఎంతకీ నిద్ర నుంచి లేవలేదు. దీంతో తల్లి అతడిని నిద్ర లేపినా లేవలేదు సరికదా.. శేఖర్ శరీరంలో చలనం కనిపించలేదు. వెంటనే స్థానికుల సహాయంతో తల్లి తన కొడుకును విమ్స్‌కు తరలించింది. అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శేఖర్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారని సీఐ తెలిపారు.

ఆర్టీసీ అధికారుల నిజాయితీ



పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను స్వాతికి అందజేస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

దాబాగార్డెన్స్: విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన రెడ్డి స్వాతి తన భర్త ప్రభాకరరావుతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో శుక్రవారం సాయంత్రం విశాఖ ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ వేచి ఉన్న సమయంలో స్వాతి తన వద్ద ఉన్న విలువైన ఫోన్‌ను పోగొట్టుకుంది. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వారు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. సిబ్బంది ఆమె నంబర్ ఆధారంగా దొంగిలించబడ్డ సెల్‌ఫోన్‌ను కొద్ది గంటల్లోనే స్వాధీనపరచుకున్నారు. ఆ ఫోన్‌ను స్వాతికి స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్ సెక్యూరిటీ సమక్షంలో అందజేశారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాఖ విద్య: పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూజీ, పీజీ పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు అనైతికమైన చర్యలకు పాల్పడటం, మాల్ ప్రాక్టీస్ చేసినట్లు వర్సిటీ అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏయూ పరీక్షలకు సంబంధించిన నియమావళికి అనుగుణంగా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఏయూ పరిధిలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరీక్షలను ప్రత్యేకంగా నియమించిన తనిఖీ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన చేసి పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులు చీటీలు పెట్టి రాయడం, పుస్తకాల్లో చూసి రాయడం, మొబైల్ ఫోన్‌లో చూసి రాయడం వంటి చర్యలకు పాల్పడడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి వీరిపై నివేదికను పరీక్షల తనిఖీ అధికారులు పంపారు. మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థుల పరీక్షను రద్దు చేయడం, నిర్దిష్ట కాలం పాటు వారు పరీక్ష రాయకుండా నిషేధించడం, ఇటువంటి చర్యలను ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, సిబ్బంది పైన క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.